# మా ఇంట్లో సూర్యుడు ఉదయిస్తాడు!

"ఓరయ్యా! నానిక్కడుండి ఏటి సేయాల! మరిక్కడ మనకేటుందని ఇక్కడుండాల? కుసింత గరువూ ఆళ్ల సేతుల్లోకి ఎల్లిపోనాది! మరింకేటుంది? కూలి పనైనా దొరుకుద్దా అంటే అది కూడా నేదు. మన బూవుల్లోనే ఆడకాడ కూలిసేత్తే మన గుండెకాయ మండుద్దని ఆళ్లు మనకి కూలిపని కూడా ఇవ్వరు! మనం ఊరొగ్గేసి పోవాల...

నాను వొయిజాగు ఎల్లిపోతా. రిచ్చబండి నాగుతా. కడుపుకోసం ఏదో సేయాల. కూకుంతే అవుద్దేటి? మీకా వొయిసు మల్లిపోనాది. కుద్దిరంగ కూకోవాల. మిమ్మల్ని ఒగ్గేసి ఎలగెల్లాల? అక్కడ కొంప దొరుకుద్దేటి? మనవొళ్ల అవుద్దేటి? మీరక్కడ వుండగల్రేటి? నానైతే ఏ సెట్టుకిందో రిచ్చాలో తొంగుంతా. మీరిక్కిడే వుండండి. నానొచ్చి పోతావుంతా. డబ్బూ గింజలూ ఇచ్చేసి ఎల్తా వుంతా. ఇయ్యాలే ఊరొగ్గేసి ఎల్లిపోతన్నా" అని సరయ్య తలిదండ్రులకు చెప్పాడు

నేను కూడా అప్పుడు అక్కడే వున్నాను. సరయ్య మాటలు వాళ్ళ మీద నిప్పుల వర్షంలా పడింది. రాళ్ళ వానలా కురిసింది. వాళ్ళల్లో చలనం లేదు. కళ్ళల్లో తడి లేదు. జీవితమంతా నిరాశలో మండిపోయినట్లు కళ్ళనుండి కన్నీళ్ళు కూడా రాలేదు. జీవితంలో అంతా పోగొట్టుకున్నట్లు, మిగిలిందేదో కూడా పోగొట్టుకుంటున్నట్లు భయంకరమైన నిశ్శబ్దంలో వాళ్ళు నిశ్శబ్దంగా ఉండిపోయారు.

"ఎల్లు! మావ్‌కాటికి కాళ్ళుజాసుగ్గూకున్నాం. పేనం ఎగిరిపోతన్నప్పుడైనా మాకాడ వుం టావా? వుండవా? సెవాల్ని ఊరోళ్ళకే ఒగ్గేస్తావా? ఏటి సేత్తాం? ఎల్లు" జీవితంలోని విషాదాన్నంతా రాళ్ళ వానలా సరయ్య తండ్రి కురిపించేశాడు.

సరయ్య బయలుదేరాడు. తడిలేని ఆ కళ్ళు సరయ్య వైపు చూస్తూ ఉండిపోయాయి. ఊరంతా అక్కడికి వచ్చేసింది. కన్నీరు కురుస్తోంది. ఊరుకి పట్టుకొన్న పరపీడల్ని ఎవరి మాటల్లో వాళ్ళు తిట్టి పోస్తూ, నిప్పులు కురుస్తున్నారు. సరయ్య లోతు లోతుగా తల్లిదండ్రుల మొహంలోకి చూశాడు. వాళ్ళ చేతులు పట్టుకున్నాడు. అతడిలోని భయంకరమైన నిశ్శబ్దం వాళ్ళలోని భయంకరమైన నిశ్శబ్దంతో ఏదో మాట్లాడింది. తలపైకెత్తి ఆకాశం లోకి చూశాడు. ఊరంతా మరోసారి కలయజూశాడు. మూడు దోసిళ్ళ నీళ్ళు తాగాడు. మొహం కడుక్కున్నాడు. కళ్ళు తుడుచుకున్నాడు.

సరయ్య వూరు వదిలేసి వెళ్ళిపోయాడు.

★ ★ ★

ఆ దృశ్యం నన్ను ఆనాటి నుండి వెంటాడుతోంది. ఏదో భయం నాలో బయలుదేరింది. ఏదో విషాదం నా గుండెల్లో ప్రవేశించింది. నన్ను కలవరపెడుతూ వస్తోంది. నేనూ సరయ్యా ఎనిమిదో క్లాసు వరకూ కలిసి చదువుకున్నాం. వ్యవసాయంలో తండ్రికి సాయపడ్డానికి సరయ్య చదువు మానేశాడు. నేను చదువు కొనసాగించాను.

మా నాన్న చిన్న వూళ్ళో చిన్న ఉపాధ్యాయుడు. నన్ను హైస్కూల్లో చేర్చేటప్పుడు మా అక్క పాదాల పట్టీలు వంటి వెండివన్నీ అమ్మేశారు. నేను హైస్కూలు చదువు పూర్తిచేయక ముందే మా అమ్మ పెద్ద పుస్తెలు అమ్మేసి పలుచని చింతాకుల్లాంటి చిన్న పుస్తెలు చేయించుకుంది. అవి తప్ప అమ్ముకోడానికి మా ఇంట్లో మరింకేమీ లేవు.

నేను కాలేజీ చదువులో చేరేటప్పుడు మాకున్న అయిదెకరాల గరువులో రెండెకరాల గరువు బండా వెంకయ్యకు తాకట్టుపెట్టి అప్పు తెచ్చారు. తిరిగి చెల్లించలేక అమ్మేశారు. కాలేజి చదువు పూర్తయ్యే లోపున మరో ఎకరా వెళ్లిపోయింది. మా అక్క పెళ్ళికీ, నా ఉద్యోగం వేటలో, మిగిలిన రెండెకరాల గరువూ వెళ్ళి పోయింది. కాలేజి చదువు పూర్తిచేసి మూడేళ్ళయింది. ఉద్యోగం దొరకలేదు. నిరాశే నా ఊపిరయింది. బాధే నా బతుకయింది. విషాదమే నా జీవితమయింది. భయమే నా భవిష్యత్తు అయింది. మా నాన్న పదవీ విరమణ చేసేసారు. నాకు ఉద్యోగం రాలేదు. ఎలా బతకడం?

నేను చాలా కష్టపడి చదివాను. మొదటి ర్యాంకుల్లో పరీక్షలన్నీ పాసయ్యాను. ఆదర్శప్రాయ విద్యార్థిగా నన్ను అందరూ ప్రశంసించారు. ఉద్యోగం నన్నే వెదుక్కుంటూ వస్తుందని అందరూ ఆశించారు. అయితే అదలా జరగలేదు. నేను ఉద్యోగం కోసం రాయని పరీక్ష లేదు. వెళ్ళని ఇంటర్వ్యూ లేదు. అంతా బాగానే జరుగుతూ ఉండేది. ఉద్యోగం మాత్రం రాలేదు. ఉద్యోగాలు డబ్బుతో కొనుక్కొనే రోజులు వచ్చేశాయి. ప్రతీదీ పెట్టుబడి అయిపోయింది. పెట్టుబడి పెట్టగలిగినవాడు బాగుపడతాడు. అది లేనివాడు కూలిపోతాడు. ఎలా బతకడం? ధనిక స్వామ్యం అన్ని బతుకుతెరువు మార్గాల్లోను పెట్టుబడిదారీ స్వామ్యంగా విస్తరిస్తూ వస్తోంది.

ఎందుకో తెలీదు, నిద్రలో సరయ్య రోజూ కనిపిస్తున్నాడు. ఆ దృశ్యం నన్ను వేటాడుతోంది. నా గుండెల్ని పిండేస్తోంది. నేనో నిర్ణయానికి వచ్చేశాను. సరయ్య దారినే నేనూ ఎంచుకున్నాను. మరోదారి కనిపించలేదు. నా నిర్ణయాన్ని మా తలిదండ్రులకు చెప్పాలని అనుకున్నాను. వాళ్ళ దగ్గరకు వెళ్ళి దగ్గరగా కూర్చున్నాను.

"అమ్మా నాన్నా! నేనిక్కడుండి ఏం చేయాలి? నేనిక్కడెందుకుండాలి? ఇక్కడ ఏముందని ఉండాలి? కలకత్తా వెళ్ళిపోతాను. ఏదో ఒహ పని చూసుకుంటాను. ఏదో ఒహటి మరింక చేయక తప్పదు. బొబ్బర్లు కొద్దిగా ఉప్పువేసి ఉడికించుకొని రెండు పూట్లా ఆహారంగా తింటూ ఎంతకాలం బతకగలం? బొబ్బర్లు దొరకనప్పుడు ఉలవలు తింటున్నాం. కూలి పనైనా చేసుకోక తప్పదు. ఇంత చదువు చదివి తెలిసినచోట కూలిపని చేయలేం. చిన్నతనంగా ఉంటుంది. అవమానంగా ఉంటుంది. ఆత్మహత్యా సదృశంగా ఉంటుంది. అక్కడైతే ఏం పని చేసినా ఎవరికీ తెలీదు. ఏ పనైనా చేస్తాను. ఉద్యోగం కోసం మూడేళ్ళు నిరంతర పోరాటం చేశాను. అలిసిపోయాను. నా చదువు ఓడిపోయింది. నా ప్రతిభ ఓడిపోయింది. నేను ఓడిపోయాను. డబ్బు గెలిచింది. ఈ వయసులో మిమ్మల్ని ఒదిలేసి ఎలా వెళ్ళడం? నాతో తీసుకొని వెళ్ళలేను. ఇల్లు దొరకదు. మీరక్కడ ఉండలేరు. వెళ్ళకుండా ఎలా బతకడం? నేను కలకత్తా వెళ్ళిపోతున్నాను. ఇవాళే బయలుదేరుతున్నాను" నా నిర్ణయాన్ని చెప్పేశాను. అంతా నిరాశ. అంతా నిస్పృహ. అంతా విషాదం. అంతా నిస్సహాయత. అంతా భయం. అంతా చీకటి. మా అమ్మ తట్టుకోలేకపోతోంది. నిశ్శబ్దంగా ఏడుస్తోంది.

'అందరం కలిసి బతకాలనుకున్నాం. అది జరగదన్నమాట. మన ప్రాణాలు వీళ్ళ చేతుల్లో సుఖంగా పోవాలనుకున్నాం. అది కూడా జరగదన్నమాట. కూలిపని కోసమే అయితే ఇంత చదువెందుకు చెప్పించారు? చదివించారు?' మా అమ్మ విలపిస్తూ మా నాన్నతో అంటోంది. నాది నిస్సహాయత. మా అందరిదీ నిస్సహాయత.

నేను బయలుదేరాను. మా కుటుంబం మాత్రమే కాదు, ఊరంతా విషాదంగా ఉంది. ఆ సమయంలో భయంకరమైన నిశ్శబ్దంలో సరయ్య నిశ్శబ్దంగా నా కళ్ళముందు కదుల్తున్నట్లుంది. ఆ విషాదం నాకూ తప్పలేదు. నా తరానికీ తప్పలేదు.

నేను మా వూరు వదిలేసి వెళ్ళిపోయాను.

★ ★ ★

నవల కాలాన్ని వానలా కురుస్తుంది. కథ కాలాన్ని వానచినుకులా కురుస్తుంది. మూడు దశాబ్దాల కాలం కాలప్రవాహంలో కొట్టుకుపోయింది. నేను పదవీ విరమణ చేసేశాను. మా వూరు చేరుకున్నాను.

సొంత ఇంట్లో ఉంటున్నాను. మాది చాలా చిన్న ఇల్లు. పెంకుటిల్లు. ఎండ, వెలుతూరూ, గాలీ, చల్లదనం వీటికి లోటులేదు. సూర్యుడు మా ఇంట్లో ఉదయిస్తాడు. మండుతాడు. గాలి ప్రభంజనంలా వీస్తుంది. వాన జడివానలా కురుస్తుంది. ఎందుకంటే, ఇంటి పైకప్పు పెంకులూడిపోయి నిజాయితీపరుని జీవితంలా ఉంది. గాలివాన వస్తే ఇల్లు కూలిపోయేలా ఉంది!

చిరువాన కురుస్తోంది. మా ఇంట్లో కూడా కురుస్తోంది. ఇంట్లో కూడా గొడుగులు వేసుకొని కూర్చున్నాం. ఇంతలో గాలివానలా మా పెద్దబ్బాయి వచ్చాడు. "అమ్మా, నాన్నా! ఇంతవరకూ మీకు చెప్పకుండా నేను ఏ పని చెయ్యలేదు. ఇప్పుడు చేసేశాను. తప్పలేదు. మూడేళ్ళయింది. ఉద్యోగం కోసం చేయని ప్రయత్నం ఏదీ లేదు. ఉద్యోగం రాలేదు. మీతో ఉండాలనీ, మీకు దగ్గరగా అందుబాటులోనైనా ఉండాలనీ, మనదేశంలోనైనా ఉండాలని అన్ని ప్రయత్నాలు చేసేశాను. అవలేదు. నా ఇంజినీరింగ్ డిగ్రీ నా గుండెల్ని కొరుక్కు తినేస్తోంది. భరించలేకపోతున్నాను. లక్షలు ఖర్చుపెట్టాం. అప్పే మిగిలింది. మనమెలా బతుకుతున్నాం? ఇల్లే సాక్ష్యం. మరింక ఇక్కడుండి ఏం చేయాలి? అమెరికా వెళ్ళిపోతున్నాను. కాగితాలన్నీ సిద్ధం చేసుకున్నాను. అమెరికాలోని నా మిత్రుడు రమ్మన్నాడు. వెళ్ళి అక్కడ ఏదో చూసుకుంటాను. ఇవాళే వెళుతున్నాను" మా అబ్బాయి గాలి వానలా కురిశాడు.

"భూసంపద, భూగర్భ సంపద, జలసంపద, వృక్షసంపద, వ్యావసాయక నైపుణ్యసంపద, వృత్తి నైపుణ్య సంపద, ప్రపంచంలో నాల్గోవంతు మేధో సంపద, సాటిలేని శ్రమ సంపద, మనకు ఏ సంపద లేదు?! అయితే, లేనివారికి ఒరుగుతున్నదేమీ లేదు. ఉన్నవాళ్ళకే అంతా వుంది. మనిషి బతకడానికి పనికావాలి. ఉపాధి కావాలి. ఉద్యోగం కావాలి. బతుకుతెరువు కావాలి. ఇవేవీ లేనప్పుడు, మనిషికి జీవించే హక్కు కూడా లేనట్లే అవుతోంది." మా రెండో అబ్బాయి ఇంజినీరింగ్ రెండో ఏడు, నిప్పులవాన కురుస్తున్నాడు.

"కలిసి బతకలేనప్పుడు, పిల్లల్ని కనడం ఎందుకు? పెంచి పెద్ద చేయడం ఎందుకు? ప్రేమ, భద్రత, శాంతి, సహజీవనం వంటివి లేకుండా ఎవరి దారిన వారు ఒంటరిగా జీవించడం ఎందుకు? కుటుంబం ఎందుకు?" నా భార్య కురుస్తున్న ప్రతి కన్నీటి బిందువూ మా గుండెల్లోని ప్రతి రక్తబిందువునూ కుదిపేస్తోంది.

★ ★ ★

ఆనాడు సరయ్యలు వూరు వదిలేసి వెళ్ళిపోయారు. నా తరం ఎందరో రాష్ట్రం ఒదిలేసి వెళ్ళిపోయారు. నా కొడుకు తరం ఎందరో దేశం ఒదిలేసి వెళ్ళిపోతున్నారు. ఆ తరువాత తరం ఎక్కడికి పోవాలి? అటు దోపిడీ ఇటు నిరుద్యోగం తీవ్రవాదాన్ని ఉధృతం చేస్తున్నాయి. యువతరాన్ని తప్పుదారి పట్టిస్తున్నాయి. సహజీవన శాంతి లేకుండా చేస్తున్నాయి. అంతా భయంగా వుంది.

★ ★ ★

పెద్దవాడు అమెరికా వెళ్ళిపోయాడు. వాడి దారి ఏమిటో తెలిసిపోయింది. రెండోవాడి దారి ఏమిటో ఇంకా తెలీదు. అంతా భయంగా, భయం భయంగా, భయానకంగా వుంది. శాంతి లేకుండా పోతున్నాం.

★ ★ ★

(పియదత్త - వారపత్రిక - 07-04-2004)

(హిందీ అనువాదం : ప్రొ॥ ఎస్. శేషారత్నం. స్రవంతి - ఫిబ్రవరి 2005)